# అంబేద్కర్ దార్శనికత మహోన్నతం

- ఆయన స్ఫూర్తి భవిష్యత్తు తరాలకు దీప్తి
- అంబేద్కర్ కీర్తిని దశదిశలా చాటినం
- బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక తదితర రంగాల్లో అణగారిన వర్గాలకు సమానవాటా, సమన్యాయం దక్కేలా రాజ్యాంగాన్ని పొందుపరచడంలో అంబేద్కర్ కనబరిచిన దార్శనికత మహోన్నతమైనదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను, అనితర సాధ్యమైన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. దేశ స్వాతంత్ర్యానంతర కాలంలో ప్రపంచానికే ఆదర్శవంతమైన స్వయంపాలన కోసం రాజ్యాంగాన్ని అందించారని గుర్తుచేశారు. దేశంలో రాష్ట్రాల ఏర్పాటు కోసం రాజ్యాంగంలో అంబేద్కర్ పొందుపరిచిన ఆర్టికల్ 3 తెలంగాణ ఏర్పాటుకు మార్గం చూపిందని తెలిపారు. అంబేద్కర్ విశేష కృషిని, వారు అందించిన స్ఫూర్తిని చాటేందుకు ప్రపంచంలోనే మహోన్నతమైన రీతిలో వారి స్ఫురద్రూపాన్ని తెలంగాణలో అత్యంత ఎత్తయిన విగ్రహంగా నిలుపుకొన్నామని వివరించారు.

### రాష్ట్ర పాలనా సౌధానికి అంబేద్కర్ పేరు

దేశపాలనకు రాజ్యాంగం ద్వారా బాటలు వేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఘనమైన కీర్తిని చాటేందుకు దేశ చరిత్రలోనే మునుపెన్నడూ లేనివిధంగా తెలంగాణ పాలనా సౌధానికి 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ స్టేట్ సెక్రటేరియట్' అని పేరు పెట్టుకున్నామని కేసీఆర్ గుర్తుచేశారు. అంటరాని వర్గాలుగా తరతరాలుగా వివక్షకు గురవుతున్న దళిత సమాజాన్ని ఆర్థికంగా బలోపేతం చేసి, వారి సామాజిక గౌరవం ఇనుమడింపజేసే దిశగా, అంబేద్కర్ స్ఫూర్తితోనే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని అమలు చేసిందని తెలిపారు. దళితుల జీవితాల్లో వెలుగులు నింపే దిశగా దళిత బంధు సత్ఫలితాలు సాధించిందని పేర్కొన్నారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ అన్ని రంగాల్లో వివక్ష లేని సమ సమాజ నిర్మాణానికి అవసరమైన కృషి చేయడం ద్వారానే అంబేద్కర్‌కు ఘననివాళి అర్పించగలమని కేసీఆర్ స్పష్టంచేశారు.

## లోకం పోకడ

## పోలీసుల నిర్బంధంలో 'అంబేద్కర్'

**కేసీఆర్ ఏర్పాటు చేశారని అక్కసు**

**వర్ధంతి నాడు ఘోర అవమానం**

**కనీసం పూలమాల వేయకుండా ఆంక్షలు**

**ప్రధాన గేట్లకు తాళం.. పరిసరాల్లో చెత్త**

**భారీ విగ్రహాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం**

అంబేద్కర్ విగ్రహ ప్రాంగణం గేట్లు మూసివేసి, కాపలాగా ఉన్న పోలీసులు

అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలోనికి వెళ్లనీయకపోవడంతో వెనుదిరిగి వెళ్తున్న వివిధ పాఠశాలల విద్యార్థులు

# నివాళిపైనా నిర్బంధమా?

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి.. భారత రాజ్యాంగ నిర్మాత.. భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి రోజునే ఆయనను కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా అవమానించింది. అంబేద్కర్ కృషిని, ఆయన స్ఫూర్తిని ప్రపంచ నలుదిశలా చాటేందుకు సెక్రటేరియట్, ట్యాంక్‌బండ్ పరిసరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన 125 అడుగుల అతిభారీ విగ్రహాన్ని పోలీసులతో నిర్బంధించింది. విగ్రహానికి పూలమాల వేయకపోగా, కనీసం పరిసరాల్లో ఉన్న చెత్తను సైతం తొలగించకుండా తన అక్కసును చాటుకున్నది. శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా సందర్శకులు కూడా లోనికి వెళ్లకుండా చుట్టూ పోలీసులతో పహరా కాసింది. ప్రధాన గేట్లకు తాళాలు వేసి కనీసం బౌద్ధ మతస్థులను సైతం ప్రార్థన చేయకుండా నిరాకరించింది. రాష్ట్రానికి తలమానికంగా నాటి బీఆర్ఎస్ సర్కార్ అతి భారీ అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పితే నేటి కాంగ్రెస్ సర్కార్ ఆ విగ్రహానికి కనీసం పూలమాల కూడా వేయలేదు. పక్కనే ఉన్న గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మీటింగ్‌కు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి విగ్రహం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ప్రాంగణమంతా పిచ్చి మొక్కలతో నిండింది. విగ్రహం పక్కన సీఎం మీటింగ్ ఉండటంతో జీహెచ్ఎంసీ అధికారులు ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేసినా, విగ్రహ పరిసరాలను మాత్రం వదిలేశారు. దీంతో మేధావులు, ప్రజా సంఘాలు, దళిత సంఘాల నేతలు మండిపడుతున్నారు. ప్రజాపాలన అని డబ్బా కొట్టుకుంటున్న రేవంత్‌రెడ్డి, అంబేద్కర్‌ను అవమానించారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రాచరిక ధోరణితో పాలన సాగిస్తున్నారని ఆక్షేపిస్తున్నారు.

### భారీగా పోలీసుల మోహరింపు..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు విగ్రహ పరిసరాలను శుభ్రం చేసి అంబేద్కర్‌కు నివాళులర్పించేందుకు ప్రయత్నించారు. కానీ వారిని ఎక్కడికక్కడ పోలీసులు హౌస్ అరెస్టులు చేశారు. అంబేద్కర్ విగ్రహం వద్దకు బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు రాకుండా అడ్డుకోవడానికి విగ్రహ పరిసరాల్లో వందలాది మంది పోలీసులు మోహరించారు. వాహనదారులు, సందర్శకులు సైతం అక్కడ ఏం జరుగుతుందోనని ఆందోళన చెందారు. విగ్రహం వద్ద ప్రార్థనలు చేసేందుకు చాలామంది బౌద్ధమతస్థులు అక్కడికి వచ్చారు. ప్రార్థన చేయడానికి విగ్రహం వద్దకు అనుమతించాలని వేడుకున్నా పోలీసులు లోనికి అనుమతించలేదు. ప్రధాన గేటు ముందు రోడ్డుపై కూర్చొని ప్రార్థనలు చేశారు. మరికొంత మంది బౌద్ధ మత విశ్వాసులు రోడ్డుపైనే పాటల రూపంలో ప్రేయర్ చేశారు. అక్కడ కూడా వారిని ఉండనీయకపోవడంతో వెనుదిరిగి వెళ్లారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నగరంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు సందర్శనకు రాగా వారినీ అనుమతించకపోవడంతో గేటు బయట నుంచే చూసి వెళ్లిపోయారు.

మొదటిపేజీ తరువాయి...

అని చెప్పిన అంబేద్కర్ మార్గంలో కేసీఆర్ సబ్బండ జనులను ఏకంచేసి ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణను సాధించి పదేండ్లలో అన్నింటా ముందుంచారని, హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల ఎత్తుతో బాబాసాహెబ్ మహా విగ్రహాన్ని నిర్మించి ఆయన మనుమడు ప్రకాశ్ అంబేద్కర్ సమక్షంలో ఆవిష్కరించారని గుర్తుచేశారు. తెలంగాణ పాలనా సౌధం సెక్రటేరియట్‌కు అంబేద్కర్ పేరుపెట్టి సమున్నతంగా గౌరవించారని చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను కాలరాస్తూ పాలనసాగిస్తున్నదని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాణీదేవి, పార్టీ ముఖ్యులతో కలిసి బాబా సాహెబ్ చిత్రపటం వద్ద కేటీఆర్ నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్‌పై, బీఆర్ఎస్‌పై కోపంతోనే సీఎం రేవంత్‌రెడ్డి అంబేద్కర్ జయంతి, వర్ధంతి, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రపంచంలోనే అతి ఎత్తయిన అంబేద్కర్ విగ్రహం వద్ద ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడంలేదని చెప్పారు. అక్కడికి వెళ్లి శుభ్రం చేసి నివాళులర్పిద్దామనుకున్న తమపై నిర్బంధం విధించి అడ్డుకుంటుకోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### దళితబంధు అడిగిన వారిపై కేసులు

దళితబంధుకు బదులు అభయహస్తం స్కీం తెస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన రేవంత్‌రెడ్డి, ఏడాదైనా ఎందుకు తేలేదని కేటీఆర్ నిలదీశారు. విద్యతోనే వికాసం వస్తుందని నమ్మి కేసీఆర్ ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్ స్కీం తెచ్చి ఏడువేల మంది దళితబిడ్డల విదేశీ చదువులకు బాటలు వేసిందని గుర్తుచేశారు. కానీ వారికి రెండో విడుత స్కాలర్‌షిప్ ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తున్నదని ధ్వజమెత్తారు. వారు విదేశాల్లో అల్లాడుతుంటే పట్టించుకోని సర్కారు, దళితబంధు అడిగిన వారిపై కేసులు పెడుతున్నదని దుయ్యబట్టారు. 'ఇదేనా అంబేద్కర్‌కు ఈ సర్కారు ఇచ్చే నివాళి? ఇదేనా దళితులపై మీకున్న ప్రేమ?' అని నిలదీశారు.

### మేం ఎవరెస్ట్ ఎక్కిస్తే మీరు పాడెక్కిస్తున్నరు

నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్యనందించే కేసీఆర్ వెయ్యి గురుకులాలను స్థాపించారని, నాడు వారిని ఎవరెస్ట్ శిఖరం ఎక్కిస్తే, నేడు రేవంత్ ప్రభుత్వం పాడెనెక్కిస్తున్నదని కేటీఆర్ నిప్పులుచెరిగారు. 12 నెలల్లో 48 మంది గురుకుల విద్యార్థుల మరణమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. 'దళిత పిల్లలు విద్యనభ్యసిస్తున్న గురుకులాలను నిర్లక్ష్యం చేయడమే మీరు అంబేద్కర్‌కు ఇచ్చే నివాళా?' అంటూ ప్రశ్నించారు. గురుకులాల స్థితిగతులను తెలుసుకొని సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్వీ గురుకుల బాటను ప్రభుత్వం అడుగడుగునా అడ్డుకోవడం, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, విద్యార్థినేతలపై కేసులు పెట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ దోపిడీని ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి 12 గంటల పాటు నిర్బంధించిందని దుయ్యబట్టారు.

### నెలరోజులు అసెంబ్లీ నిర్వహించాలి

చెప్పిన మాటలు, ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని కాంగ్రెస్‌కు నమ్మకముంటే వచ్చే అసెంబ్లీ సమావేశాలను నెలరోజులు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లగచర్ల ఘటన మొదలుకొని రైతుల ఆత్మహత్యలు, 420 హామీల వైఫల్యం, వ్యవసాయ రంగ సంక్షోభం ఇలా ప్రతి అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. 'రేవంత్‌రెడ్డీ..మా పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌పై కారుకూతలు మానకుంటే ముఖ్యమంత్రి పదవికి గౌరవం కూడా ఇవ్వబోం' అంటూ తేల్చిచెప్పారు. కుక్కకాటుకు చెప్పుదెబ్బ తరహాలో ఆయనకు ప్రజాక్షేత్రంలో తగిన బుద్ధిచెప్తామని హెచ్చరించారు.

### 12 కూల్చివేతలు.. 24 అణచివేతలు : సిరికొండ

'కాంగ్రెస్ ఏడాది పాలనలో 3 తిట్లు.. 6 శాపనార్థాలు.. 12 కూల్చివేతలు, 24 అణచివేతలు.. 420 హామీల ఎగవేతలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీలేదు' అని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా తెలంగాణను సాధించిన కేసీఆర్.. ఆ మహనీయుడి స్ఫూర్తితో పదేండ్లు అద్భుతంగా పాలించి ప్రజల కలలను సాకారం చేశారని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించి తెలంగాణ సెక్రటేరియట్‌కు ఆయన పేరుపెట్టి గౌరవించారని పేర్కొన్నారు. కానీ, ఏడాది కిందట గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి అంబేద్కర్ సెక్రటేరియట్‌లో కూర్చొని ఆయనను స్మరించడం లేదని తప్పుబట్టారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని చేతబట్టుకొని నీతి ప్రవచనాలు చెప్తున్నారని, తెలంగాణలో హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న తమ పార్టీ సర్కారును మాత్రం వెనకేసుకొస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, కరీంనగర్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, దూదిమెట్ల బాలరాజు, నాయకులు సుశీలారెడ్డి, కిషోర్‌గౌడ్, తుంగ బాలు పాల్గొన్నారు. 'కేసీఆర్ కట్టిన సచివాలయంలో, పోలీస్ కంట్రోల్ రూమ్‌లో సమీక్షిస్తూ, ఫ్లై ఓవర్లను, యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రారంభిస్తూ... కేసీఆర్ ప్రతిష్ఠించిన అంబేద్కర్ విగ్రహానికి మాత్రం నివాళులు అర్పించకుండా నిర్బంధిస్తారా? ఇది దళితుల మీద కక్షా, మహనీయుడు అంబేద్కర్ మీద వివక్షా?' అని కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. జాగో తెలంగాణ జాగో అని ప్రజలకు సూచించారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మధుసూదనాచారి, జగదీశ్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, వాణీదేవి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బాల్క సుమన్, శంకర్‌నాయక్, భాస్కర్‌రావు, రమణ, దేవీప్రసాద్, సుభాశ్‌రెడ్డి, తుల ఉమ, శ్రీధర్‌రెడ్డి, ఎర్రోళ్ల, వాసుదేవరెడ్డి, దూదిమెట తదితరులు

> రాజ్యాంగ పరిరక్షకుడిలా పోజులు కొట్టే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ.. ఆ పార్టీ పాలిత రాష్ట్రంలో జరుగుతున్న హక్కుల హననాన్ని ఎందుకు పట్టించుకోవడంలేదు? ఉత్తరప్రదేశ్‌లో అడ్డుకున్న పోలీసులపై ఉక్రోశం వెళ్లగక్కిన రాహుల్.. అదే హోదాలో ఉన్న తెలంగాణ ఎమ్మెల్యేలు, శాసనసభాపక్షనేతలను పోలీసులు అడ్డుకుంటున్నా ఎందుకు నోరు మెదపడం లేదు? -కేటీఆర్

> 'రేవంత్‌రెడ్డీ.. నువ్వు నిర్బంధిస్తున్నది ప్రశ్నించిన వారినో, హక్కులు అడిగిన వారినో కాదు! భారతరత్న బాబాసాహెబ్‌ను.. విశ్వవిఖ్యాతి గాంచిన మహనుభావుడి విగ్రహాలను హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ లాంటి యూనివర్సిటీల్లో పెట్టి గౌరవిస్తుంటే.. కనీసం విగ్రహం వద్దకు వెళ్లి నివాళులర్పించే తీరిక కూడా ముఖ్యమంత్రికి లేకపోవడం ఆయన కురుచబుద్ధికి నిదర్శనం.. 125 అడుగులున్న అంబేద్కర్ విగ్రహాన్ని నిర్లక్ష్యం చేయడం వెనుక నీ ఉద్దేశమేంది? ఆ మహానేత ఆలోచనా విధానాలను వ్యతిరేకిస్తున్నవా? లేక గతంలో పీవీ నర్సింహారావును కించపరిచిన కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాలతోనే ఇలా చేసినవా? - కేటీఆర్

## రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ

- నియంతృత్వ పాలనకు నిర్బంధాలే నిలువుటద్దం
- ఉల్లంఘనలపై అంబేద్కరే నివ్వెరపోతుండు
- బీఆర్ఎస్ నేతలను విడుదల చేయాలి
- అంబేద్కర్‌కు నివాళులర్పించొద్దా?: హరీశ్ ఫైర్
- అంబేద్కర్ వర్ధంతి నాడు ప్రభుత్వ ఆంక్షలేమిటి?
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మండిపాటు
- రాజ్యాంగ నిర్మాతకు అవమానం: దాసోజు

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): ఓవైపు ప్రజాపాలన విజయోత్సవాలు అని ప్రచారం చేసుకుంటూ మరోవైపు రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేయడం ఏమిటని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. రాష్ట్రంలో నియంతృత్వపాలనకు నిర్బంధాలు నిలువుటద్దంగా మారాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టులు, నిర్బంధాలు చేయడాన్ని శుక్రవారం ఎక్స్‌వేదికగా ఖండించారు. 'బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించేందుకు వెళ్లనివ్వకుండా ఈ నిర్బంధాలు ఎందుకు? మీ అప్రజాస్వామిక వైఖరిని చూసి హైదరాబాద్ నడిగడ్డపై ఉన్న అంబేద్కర్ సైతం నివ్వెరపోతున్నరు' అంటూ మండిపడ్డారు. అదుపులోకి తీసుకున్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### ఇదేం ప్రజాపాలన : నిరంజన్‌రెడ్డి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి నాడు ప్రభుత్వం ఆంక్షలు విధించడం ఏమిటని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నిలదీశారు. 'రాజ్యాంగ నిర్మాతకు నివాళులర్పించకుండా ఇంత నిర్బంధమా? ఇది ప్రజా ప్రభుత్వమా? ప్రజలను హింసించే ప్రభుత్వమా?' అని ప్రశ్నించారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడం రాహుల్‌గాంధీకి కనిపించడం లేదా?' అని నిలదీశారు. ఇదేం ప్రజాపాలన?' అని భగ్గుమన్నారు.

### క్షమించరాని నేరం : దాసోజు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ఉన్న కోపంతో కనీసం దండ వేయకుండా భారత రాజ్యాంగ నిర్మాతను అవమానించడం క్షమించరాని నేరమని బీఆర్ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్‌పై కక్ష, కార్పణ్యాలతో దేశానికి తలమానికమైన నేత విగ్రహం వర్ధంతి రోజు కూడా దండలేకుండా బోసిపోయి కనిపించడం దారుణమని ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తంచేశారు.

## అంబేద్కర్ విగ్రహానికి నిరాదరణ

**బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి సతీశ్‌రెడ్డి**

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): మహాపరినిర్వాణ్ దివస్ సందర్భంగా ప్రపంచమంతా అంబేద్కర్‌కు నివాళులర్పిస్తే ప్రపంచంలోనే ఎత్తయిన అంబేద్కర్ విగ్రహం నిరాదరణకు గురైందని బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి వై సతీశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. అంబేద్కర్ భారీ విగ్రహం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు పహరా ఏర్పాటు చేయడంపై ఎక్స్ వేదికగా మండిపడ్డారు.

## అంబేద్కర్ ఆశయ సాధనే మా లక్ష్యం: వంగపల్లి

మషీరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): అంబేద్కర్ ఆశయ సాధనే తమ లక్ష్యమని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. రిజర్వేషన్ ఫలాలు అట్టడుగు వర్గాలకు అందించడమే అంబేద్కర్‌కు నిజమైన నివాళి అని అభిప్రాయం వ్యక్తంచేశారు. శుక్రవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా రాజ్యాంగ నిర్మాత చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

## రేపు బీఆర్ఎస్ఎల్పీ సమావేశం

**దిశానిర్దేశం చేయనున్న కేసీఆర్**

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఆదివారం బీఆర్ఎస్ఎల్పీ సమావేశం జరుగనున్నది. ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో జరిగే ఈ సమావేశానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహం, లేవనెత్తాల్సిన ప్రజా సమస్యలపై సభ్యులకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇంటి ముందు మోహరించిన పోలీసులు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును నిర్బంధంలో ఉంచి ఇంటి ముందు మోహరించిన పోలీసులు

తెలంగాణ భవన్ ముందు భారీగా పోలీసులు

# అటు అవమానం... ఇటు నిర్బంధం

- అంబేద్కర్ వర్ధంతి వేళ పరిస్థితి ఉద్రిక్తం
- సర్కారు నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ ఆగ్రహం
- ట్యాంక్‌బండ్‌పై ధర్నాకు నిర్ణయం
- బీఆర్ఎస్ నేతల గృహ నిర్బంధం

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌లోని మహావిగ్రహానికి కనీసం పూలమాల వేయకుండా సర్కారు అవమానించింది. రాజ్యాంగ నిర్మాతకు నివాళులర్పించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై నిర్బంధకాండను అనుసరించింది. సర్కారు వైఖరిని నిరసిస్తూ ట్యాంక్‌బండ్‌పై బీఆర్ఎస్ నేతలు ధర్నాకు సిద్ధమవగా భగ్నం చేసేందుకు పూనుకున్నది. పోలీసులను ఉసిగొల్పి నేతలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేయించింది. సచివాలయం సమీపంలోని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్దసంఖ్యలో పోలీసులను మొహరించింది. పరిసరాల్లోకి నాయకులతో పాటు సామాన్యుల కూడా అనుమతించలేదు. ధర్నాకు వెళ్తున్నారనే సమాచారంతో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయనను హౌజ్ అరెస్టు చేసింది. మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నివాసం వద్ద కూడా శుక్రవారం తెల్లవారుజాము నుంచే పోలీసులు మోహరించారు. వ్యక్తిగత పనులపై బయటకు వెళ్తామని చెప్పినా పోలీసులు వినిపించుకోలేదు. ఎమ్మెల్సీ కవితను నందినగర్‌లోని ఆమె నివాసంలోనే పోలీసులు నిర్బంధించారు. ఉదయాన్నే అక్కడికి చేరుకున్న సిబ్బంది చీకటిపడేదాకా ఆమె ఇంటివద్దే కాపాలకాశారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందను హౌస్‌అరెస్ట్ చేశారు. కొంపల్లి దండెమూడి ఎంక్లేవ్‌లోని ఆయన ఇంటి ఎదుట పదుల సంఖ్యలో పోలీసులు మొహరించారు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించేందుకు బయల్దేరిన బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను సచివాలయం సమీపంలో అరెస్ట్ చేసి, బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నగరంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ ఇండ్లలో నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు.

### తెలంగాణ భవన్ వద్ద హైటెన్షన్

అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు మాజీమంత్రి కేటీఆర్ శుక్రవారం ఉదయం తెలంగాణ భవన్‌కు వస్తున్నారనే సమాచారంతో పోలీసులు పెద్దసంఖ్యలోఅక్కడికి చేరుకున్నారు. భవన్‌లో ఉన్నంతసేపూ బయట మొహరించారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేయనున్నారని తెలియడంతో పెద్దసంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ఎప్పుడేం జరుగుతుందోనని ఆందోళన కనిపించింది. కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కేటీఆర్ బయటకు వస్తుండగా భవన్ ప్రధాన ద్వారం ఎదుట పోలీసులు నిలబడ్డారు. అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లవద్దని వారించారు.

### మాజీమంత్రుల ఆగ్రహం

**పోలీసులు** బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయడంపై మాజీమంత్రులు హరీశ్‌రావు, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. అంబేద్కర్ వర్ధంతి రోజు నిర్బంధాన్ని ప్రయోగించడం సిగ్గుచేటని ఖండించారు. మహానేతకు నివాళులర్పించకుండా అడ్డుకోవడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. ప్రజాపాలన అని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ హక్కుల హననకు పాల్పడుతున్నదని నిప్పులుచెరిగారు.